

49 కిలోల వెండి స్వాధీనం

అక్రమంగా తరలిస్తున్న 49 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు చిత్తూరు వెస్ట్ సర్కిల్ సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. - 8లో



భగీరథ యత్నం.. వసతులు లభ్యం

రెల్వేస్టేషన్ల అభివృద్ధికి మంత్రి రోజా అలుపెరగని పోరాటం చేశారు. ఫలితంగా రైల్వేస్టేషన్లలో వసతులు సమకూరుతున్నాయి. - 8లో



సమష్టిగా గెలుపు సాధిద్దాం

పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేసి, కుప్పంలో వైఎస్సార్ సీపీ విజయంలో పాలు పంచుకోవాలని ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప కోరారు. - 8లో

న్యూస్‌రీల్

తహసీల్దార్ల బదిలీకి రంగం సిద్ధం

- బదిలీ కానున్న 22 మంది

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్లు బదిలీకి ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేసినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు 22 మంది బదిలీ కానున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 32 మండలాలుండగా అందులో 8 మంది తహసీల్దార్లు ఉద్యోగ విరమణకు చేరువలో ఉండడంతో ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కల్పించనున్నారు. వారు ఎన్నికలు పూర్తి అయ్యే వరకు కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తించనున్నారు. అలాగే ఇద్దరు ఇతర జిల్లాలకు చెందిన వారు కావడంతో వారికి బదిలీల్లో మినహాయింపు కల్పించారు. దీంతో మిగిలిన 22 మంది ఇతర జిల్లాలకు బదిలీ కానున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు. త్వరలో రాష్ట్ర ఉన్నతాధికారులు తహసీల్దార్లకు బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

రక్తదాన శిబిరాలు రేపు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో, కుప్పం పీఈఎస్ మెడికల్ కాలేజీలో, పలమనేరు పీహెచ్‌సీలో జిల్లా ప్రభుత్వాస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నగరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తారని చెప్పారు. రక్తదానం చేసే ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేసేవారు ఆయా డివిజన్లలోని ఆర్డీఓ కార్యాలయాల్లో ముందస్తు గా పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

7 లోపు విద్యుత్ బిల్లులు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్‌ఏఓ శ్రీనివాసులు


చిత్తూరు కార్పొరేషన్: ప్రతి నెలా 7వ తేదీ లోపు వినియోగదారులకు విద్యుత్ బిల్లులు ఇవ్వాలని ట్రాన్స్‌కో ఎస్‌ఏఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రూరల్ ఈఈ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం అర్బన్ రెవెన్యూ ఏఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. గతంలో 9వ తేదీలోపు బిల్లులు ఇచ్చేవారని, ఫిబ్రవరి నుంచి 7వ తేదీలోపు ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై బిల్లింగ్ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. గత నెల డివిజన్ పరిధిలో దాదాపు వంద శాతం విద్యుత్ బిల్లులు వసూలైనట్లు చెప్పారు. అలాగే ప్రతినెలా వసూలు చేయాలన్నారు. రూ. 5 వేలు కన్నా ఎక్కువ బిల్లు మొత్తం పెండింగ్‌లో ఉండే ప్రైవేటు సర్వీసులను డిస్‌కనెక్ట్ చేయాలన్నారు. ప్రతిచోట స్కానర్లతో రీడింగ్ తీయాలన్నారు. తప్పనిసరి పరిస్థితిలో మ్యానువల్‌గా తీయాలన్నారు. రూరల్ ప్రాంతంలో ఇటీవల సాంకేతిక, రీడింగ్ సమస్యలు వస్తున్నాయన్నారు. వర్క్‌ఆర్డర్లను సకాలంలో ఏఈలు క్లోజ్ చేయాలన్నారు. లేనిపక్షంలో జీతాల నుంచి ఆ మొత్తం కట్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ హరి, పద్మనాభపిళ్లై, డీఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నగరి పీఏసీఎస్‌కు స్టార్ కోడ్ సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకుంటున్న పీఏసీఎస్ చైర్మన్, సీఈఓ

నగరి : స్థానిక పీఏసీఎస్‌కు స్టార్ కోడ్ సర్టిఫికెట్ వచ్చింది. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన సహకార్‌సే సమృద్ధి కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ సహకార కేంద్ర అధికారులు నగరి పీఏసీఎస్ సీఈఓ తులసి, అధ్యక్షుడు తిరుమల రెడ్డికి అవార్డును అందజేశారు. అవార్డు దక్కడంపై అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో నగరి, చిత్తూరు, పలమనేరు పీఏసీఎస్‌లకు ప్రోగ్రెస్‌ను అనుసరించి స్టార్ కోడ్‌లు అందజేశారన్నారు. త్వరలో దేశవ్యాప్తంగా 2 వేల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పరిధిలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషద కేంద్రాలను ప్రారంభించనున్నారని చెప్పారు. ఇప్పటికే జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్న సహకార కేంద్రాన్ని ప్రస్తుతం వచ్చిన అవార్డు ప్రోత్సాహంతో మరింత ముందుకు తీసుకెళతామన్నారు. ఇప్పటికే సహకార సంఘం తరపున పెట్రోల్ బంకును నిర్వహిస్తున్నామని, త్వరలో జనరిక్ మెడికల్ షాపులను కూడా నిర్వహిస్తామన్నారు.



పల్లె ముంగిటకే పాలన తేవాలి.. పేదల సమస్యలు పరిష్కరించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తలిచారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేశారు. అన్ని సేవలను ప్రజల దరి చేర్చి, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించారు. ఈ సేవలపై జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామస్వరాజ్యం

పుంగనూరు మున్సిపాలిటీలోని నానబాలవీధి సచివాలయం



- పల్లె చెంతకే సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- అందించిన సేవలు 3,91,415

పుంగనూరు: బాపూజీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. దీని ద్వారా పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా వలంటీర్లను భాగస్వాములను చేశారు. రాష్ట్రమంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో సచివాలయ వ్యవస్థ ఆదర్శంగా నిలిచింది.



పుంగనూరు కొత్తయిండ్లు సచివాలయంలో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న సిబ్బంది

పేదలకు వరం



ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి, సర్టిఫికెట్లు తీసుకునే బాధ తప్పింది. నాకు ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కులం, ఆదాయం సర్టిఫికెట్లను ఉచితంగా తీసుకున్నాను. జీవితాంతం సులభంగా సర్టిఫికెట్లు తీసుకోవచ్చు. సర్టిఫికెట్ నంబర్ చెప్పితే మళ్లీ సర్టిఫికెట్ ఇస్తారు. ఎవరి దగ్గరికీ తిరగాల్సిన అవసరం లేదు. సీఎం అమలు చేస్తున్న పథకాలన్నీ పేదలకు ఒక వరంలాంటివి. ఇలాంటి సీఎం ఉండడం ఏపీకి మంచిది.

– శిల్ప, రామచంద్రాపురం కాలనీ, రొంపిచెర్ల మండలం

రెండు రోజుల్లోనే పరిష్కారం



ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం వలంటీర్‌కు చెప్పిన వెంటనే అర్జీ తీసుకుని, వెళ్లింది. తరువాత రెండు రోజుల్లోనే సర్టిఫికెట్ ఇంటికి వచ్చి అందజేసింది. గత చంద్రబాబు ప్రభుత్వంలో రోజుల తరబడి మండల కార్యాలయం చుట్టూ తిరిగేవారం. అయినా పని జరిగేది కాదు. జగన్న సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చిన తరువాత ఏసమస్య అయినా వెంటనే పరిష్కారమవుతుంది. అడిగిన వెంటనే మా సమస్యను పరిష్కరించినందుకు మేము జగనన్న మేలు ఎప్పటికీ మరువలేం.

– ఆర్.షబీనా, ఎగువవీధి, కల్లూరు, పులిచెర్ల మండలం

అందుబాటులో సిబ్బంది



గత ప్రభుత్వ హయాంలో ఏ పనికైనా మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. సచివాలయ వ్యవస్థ ఏర్పడిన అనంతరం ఆ బాధ తప్పింది. సచివాలయంలో అన్ని విభాగాలకు సంబంధించిన సిబ్బంది అంటుబాటు లో ఉండడంతో దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత వ్యవధిలోపే సమస్య పరిష్కారం అవుతోంది.

– దుర్గా ప్రసాద్‌రెడ్డి, బళ్లావాండ్లపల్లె, సదుం మండలం

నా ఇంటి వద్దకే సర్టిఫికెట్లు



నేను వ్యాపారం చేసి జీవిస్తున్నాను. సచివాలయాలకు సకాలంలో వెళ్లలేక పోవడంతో వలంటీర్, సచివాలయ కార్యదర్శులు మా ఇంటి వద్దకే వచ్చి మా పిల్లల పుట్టిన సర్టిఫికెట్లు అందజేశారు. గతంలో సర్టిఫికెట్లు తీసుకోవాలంటే దేవుడు కనిపించేలా కష్టపడేవాళ్లం. ఇప్పుడు జగనన్న దేవుడులా మా ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి సేవలు అందిస్తున్నారు. ఇలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. తిరిగి ఆయనే సీఎం కావాలని కోరుతున్నాను.

–ఎం.బాబు, ఆవుల వ్యాపారి, పుంగనూరు

ప్రదక్షిణలు తప్పాయ్



ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం గత ప్రభుత్వ హయాంలో మండల కార్యాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాము. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ మా ఇంటికే వచ్చి మా సమస్యను తెలుసుకుని, ఇంటికే అన్ని రకాల ధ్రువపత్రాలు తెచ్చి ఇచ్చారు. దీంతో మాకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే పని తప్పింది. అన్ని సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తోంది. జగనన్నకు మేము ఎప్పుడూ రుణ పడిఉంటాం.

– ఎం. సరస్వతి లబ్ధిదారు, ఊదగమాకులపల్లె, పులిచెర్ల మండలం

మున్సిపాలిటీ, మండలాల వివరాలివీ..

పుంగనూరు మున్సిపాలిటీ, పుంగనూరు రూరల్ మండలం, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల .

మొత్తం సచివాలయాలు	115
నిర్మాణ ఖర్చు	రూ.46 కోట్లు
పూర్తి అయిన సచివాలయాలు	92
నిర్మాణదశలో ఉన్నవి	23
సచివాలయాల్లో అందించిన మొత్తం సేవలు	3,91,415

డిజిటల్ బోర్డులు: పుంగనూరు నియోజకవర్గంలోని సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన పథకాలు, ఖర్చు చేసిన వివరాలతో కూడిన డిజిటల్ బోర్డులను ప్రతి సచివాలయంలోను ఏర్పాటు చేశారు. దీని ద్వారా పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టారు.



జగనన్నకు రుణపడి ఉంటాం

ఆపదలో ఉన్న తమ కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిస్తూ ఆదుకుంటున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. నేను మానసిక వికలాంగుడిని. గతంలో వికలాంగ పింఛన్ కోసం పలుసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ న్యాయం జరగలేదు. సచివాలయంలో అర్జీ ఇచ్చిన వెంటనే వలంటీర్ సహకారంతో నా సమస్యను పరిష్కరించారు. నాకు నెల నెలా రూ.3 వేలు చొప్పున పెన్షన్ అందుతోంది.

– లోకేష్, చిట్రెడ్డిపల్లె, చౌడేపల్లె మండలం

సొంత ఇంటి కల నెరవేరింది



సచివాలయాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రభుత్వ పథకాలు మాకు ఇంటి వద్దకే చేరుతున్నాయి. నాకు సొంత ఇల్లు లేదని గతంలో పలుసార్లు అర్జీలిచ్చినా పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఏర్పాటు చేసిన సచివాలయంలో అర్జీ ఇచ్చాను. విచారించి నాకు అధికారులు ఇల్లు మంజూరు చేశారు. నాకు అధికారులు దశల వారీగా బిల్లులు చెల్లించారు. నా సొంతిటి కల నెరవేరింది.

–కె. జయశ్రీ, చిట్రెడ్డిపల్లె, చౌడేపల్లె మండలం

పకడ్బందీగా భూ రీ సర్వే పనులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా భూ రీ సర్వే పనులు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం విజయవాడ నుంచి పలు అంశాల్లో ప్రగతిపై సీసీఎల్‌ఏ సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు జిల్లాలో నిర్వహిస్తున్న పలు పథకాల ప్రగతిని సీసీఎల్‌ఏకు వివరించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మూడో విడత రీ సర్వే పనులు నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణాలకు సేకరిస్తున్న భూములను వెంటనే అప్పగించేందుకు కసరత్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 106 గ్రామాలలో మూడో విడత భూ రీ సర్వే కసరత్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడో విడతలో జిల్లా వ్యాప్తంగా 10,048 సర్వే రాళ్లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇప్పటివరకు 60,583 సర్వే రాళ్లు క్షేత్రస్థాయిలో అందజేయగా 5 వేల రాళ్లు సర్వే పూర్తి అయిన ప్రాంతాల్లో నాటారని వెల్లడించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ (భూహక్కులచట్ట)పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లాకు ఇద్దరు నోడల్ అధికారులను నియమించడం జరుగుతుందని సీసీఎల్‌ఏ తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షలో డీఆర్వో రాజశేఖర్, జిల్లా సర్వే శాఖ ఏడీ గౌస్ అహ్మద్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

నగరి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్, కాల్‌మస్ సర్వీసెస్, చెన్నై వారి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం టెలికాలర్ ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. నెలకు రూ.15 వేలు జీతం, ఉచిత వసతి సౌకర్యం, ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బయోడేటా, పదో తరగతి నుంచి డిగ్రీ వరకు మార్క్ జాబితా జిరాక్స్, ఒరిజినల్ ఐడెంటిటీ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోతో గురువారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివరాలకు జేకేసీ ఫుల్ టైం మెంటార్ లాల్ బాషాను 9573104593 నంబర్‌లో, కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ పార్థసారథి 9884787264 నంబర్‌లో, కంపెనీ యూనిట్ హెడ్ ధనరాజ్ 9884304026 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నూతన క్రీడా చరిత్ర..ఆడుదాం ఆంధ్రా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా



క్రికెట్ ఆడుతున్న మంత్రి ఆర్కే రోజా

- క్రీడాకారులకు ఆటల జాతర
- రూ.వందకోట్ల వ్యయంతో నిర్వహించే గొప్ప క్రీడా సంబరం
- ఆటగాళ్ల ప్రతిభ, స్థాయిని పెంచుతున్న జగనన్న
- మండల స్థాయి పోటీలు ప్రారంభించిన మంత్రి ఆర్కేరోజా

నగరి : ఆడుదాం ఆంధ్రా.. నూతన క్రీడాచరిత్ర అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం స్థానిక కేవీకే మైదానంలో మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె క్రికెట్, వాలీబాల్, కబడ్డీ ఆడి, క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత, క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, వారు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించేలా జగనన్న కృషి చేస్తున్నారన్నారు. జీవితంలో అయినా చదువులో అయినా క్రీడల్లో అయినా గెలుపు సాధించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. చిత్తశుద్ధితో కష్టపడి సాధన చేసి పోటీ పడితే గెలవడం పక్కా అన్నారు. విజయం సాధించినప్పుడు చరిత్రలో నిలిచి పోతామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో విజేతలకు గ్రూప్ వన్ పోస్టులు ఇవ్వడంతోపాటు పలు అకాడమీలు నిర్మించి క్రీడాకారులకు కోచింగ్ క్యాంపులు పెట్టి ట్రెనింగ్ ఇవ్వడానికి కూడా అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. 15,004 సచివాలయాల పరిధిలో పోటీలు ముగిసి, మండల స్థాయి పోటీలు ప్రారంభం అవుతున్నాయన్నారు. ఈ పోటీల అనంతరం నియోజకవర్గస్థాయి, జిల్లా, రాష్ట్రస్థాయి అంటూ 2.99 లక్షల మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలు రాష్ట్రంలో పండుగ వాతావరణాన్ని సృష్టించాయని చెప్పారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు మంత్రి రోజా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూజలు చేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగరి మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీఓ లీలామాధవి తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోడుగా..

- జిల్లాలో 15,085 మందికి రూ.15.96 కోట్ల రుణ సాయం
- 28,450 మందికి రూ.76.23 లక్షల వడ్డీ జమ
- నేడు జగనన్న తోడు ఎనిమిదో విడత నిధులు విడుదల చేయనున్న సీఎం



చిత్తూరు అగ్రికల్చర్: చిరువ్యాపారులు, తోపుడు బండ్లపై వస్తువులు, కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించే వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. జగనన్న తోడు పథకం ద్వారా రుణసాయాన్ని అందించడమే కాకుండా, సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ మొత్తాలను కూడా ప్రభుత్వమే జమ చేస్తోంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇప్పటికే ఏడు విడతల్లో చిరువ్యాపారులకు రుణాలు అందించి ఆదుకుంది. అదే తరహాలో గురువారం ఎనిమిదో విడతగా జగనన్న తోడు పథకం ద్వారా చిరువ్యాపారులకు రుణాలను ప్రభుత్వం అందిస్తోంది. దీంతోపాటు ఏడో విడతలో రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ మొత్తాలను జమ చేస్తోంది. ఈ మొత్తాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంతో లబ్ధిదారులకు రుణాల పంపిణీ, వడ్డీ మొత్తాల జమను ప్రారంభించనున్నారు.

జిల్లాలో 15,085 మందికి లబ్ధి

జిల్లావ్యాప్తంగా పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లోనూ పలువురు చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వ్యాపార నిర్వహణకు అవసరమైన పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఉండేది. ఇలాంటి పరిస్థితుల నుంచి చిరు వ్యాపారులకు వెసులుబాటు కల్పించేందుకు ప్రస్తుతం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎలాంటి పూచికత్తు లేకుండా జగనన్న తోడు పథకం కింద బ్యాంకుల ద్వారా ప్రతి చిరువ్యాపారికి రూ.10 వేల రుణసాయాన్ని అందించే ప్రక్రియ చేపట్టింది. ఇప్పటి వరకు ఏడు విడతల్లో చిరువ్యాపారులకు రుణసాయం అందించింది. ప్రస్తుతం ఎనిమిదో విడతగా జిల్లా వ్యాప్తంగా 15,085 మంది వ్యాపారులకు రూ. 15.96 కోట్ల మేరకు రుణాలను మంజూరు చేసింది. అందులో పట్టణ ప్రాంతంలో 4,347 మందికి రూ. 4.59 కోట్లు, గ్రామీణ ప్రాంతంలో 10,738 మందికి రూ.11.36 కోట్లు లబ్ధి చేకూరనుంది. అలాగే ఏడో విడతలో రుణాన్ని పొంది సకాలంలో చెల్లించిన 28,450 మందికి రూ.76.23 లక్షల మేరకు వడ్డీ మొత్తాలను జమ చేయనుంది. అందులో పట్టణ ప్రాంతంలో 9,763 మందికి రూ.26.16 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో 18,687 మందికి రూ. 50.07 లక్షలు మేరకు వడ్డీ మొత్తాలను జమ చేస్తారు.

నియోజకవర్గం వారీగా రుణాల వివరాలిలా..

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	రూ.లక్షల్లో
చిత్తూరు	3,039	321.54
జీడీ నెల్లూరు	1,887	199.60
కుప్పం	641	67.84
నగరి	1,207	127.72
పలమనేరు	3,413	361.15
పుంగనూరు	2,365	250.27
పూతలపట్టు	2,533	268.01
మొత్తం	15,085	1596.13

నేడు జగనన్న తోడు

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్న తోడు ఎనిమిదో విడత పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11వ తేదీన ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ పథకంలో జిల్లాలో అర్హులైన 15,085 మందికి లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.15.96 కోట్లను జమ చేయనుందని చెప్పారు. జిల్లాస్థాయి కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు విచ్చేస్తారని ఇన్‌చార్జి కలెక్టర్ పేర్కొన్నారు.

12 తేదీకి క్షేత్రస్థాయి ఓటర్ల విచారణ పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీకి ఓటర్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి అవుతుందని డీఆర్వో రాజశేఖర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 9వ తేదీ వరకు అందిన ఓటర్ల దరఖాస్తులను ఈ నెల 12వ తేదీకి క్షేత్రస్థాయిలో పరిశీలించడం పూర్తి అవుతుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో గుర్తించిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రధాన కేంద్రాలు, విద్యాసంస్థల్లో ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ఈవీఎంలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, గంగరాజు, సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్ ట్రైన్ లైన్‌కు భూములు ఇవ్వబోం


గుడిపాల: రైతులతో మాట్లాడుతున్న నరసింహ

గుడిపాల: బుల్లెట్ ట్రైన్ లైన్ కోసం భూములు ఇవ్వలేమని రైతులు తెలిపారు. బసవాపల్లె సచివాలయం పరిధిలో నేషనల్ హైస్పీడ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్)చెన్నై–మైసూర్ వెళ్లే బుల్లెట్ ట్రైన్ అసిస్టెంట్ ఇంజినీర్ నరసింహ ఆధ్వర్యంలో బుధవారం బసవాపల్లె పంచాయతీ రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెన్నై నుంచి మైసూర్ నగరాల మధ్య 435 కిలోమీటర్ల దూరం రైల్వేలైన్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను చిత్తూరు జిల్లాలో 41 పంచాయతీల మీదుగా బుల్లెట్ ట్రైన్ లైన్ ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ లైన్ కోసం రైతులు భూములు ఇవ్వాని, మార్కెట్ వి లువకు ఐదు రెట్లు అదనంగా పరిహారం ఇస్తామని తెలిపారు. దీంతోపాటు భూములు కోల్పోయిన రైతుల కుటుంబాల్లో చదువుకున్న వ్యక్తులు ఉన్నట్లయితే ఉద్యోగం కూడా ఇస్తామన్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తాము బుల్లెట్ ట్రైన్ లైన్‌కు భూములను ఇవ్వమని తెలిపారు. కొంతమంది రైతులు తమకు ఎకరా భూమికి రూ.50 లక్షలు ఇవ్వాలని, దీంతో పాటు మామిడి, కొబ్బరి చెట్లకు ఒక్కొక్క చెట్లుకు రూ.70 వేలు అందించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

సమష్టిగా గెలుపు సాధిద్దాం

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్సీ, ఎంపీ పిలుపు
- చంద్రబాబును ప్రజలు ఓడించడం తథ్యం

శాంతిపురం: పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేసి, కుప్పంలో వైఎస్సార్ సీపీ విజయంలో పాలు పంచుకోవాలని ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప పిలుపునిచ్చారు. బుధవారం చౌడంపల్లె క్రాస్ వద్ద పంచాయతీ పార్టీ కమిటీలు, బూత్ కమిటీలు, గృహ సారథులు, నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ఓడించటం ద్వారా కుప్పం ప్రజలు కొత్త చరిత్రను సృష్టిస్తారని జోస్యం చెప్పారు. గత 35 ఏళ్లుగా తమకు జరిగిన మోసాన్ని స్థానిక ప్రజలు గుర్తించారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ లబ్ధి పొందితే టీడీపీ హయాంలో ఆ పార్టీకి చెందిన కొందరు మాత్రమే బాగుపడ్డారన్నారు. ఎన్నికల హామీలను ఎన్నడూ అమలు చేసిన చరిత్ర లేని చంద్రబాబు మళ్లీ కొత్త వాగ్దానాలతో ప్రజలను మరోసారి వంచించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా ఓ వర్గం మీడియాను అడ్డు పెట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయడమే దినసరి కార్యక్రమంగా పెట్టుకున్నారని, అయినా లబ్ధి పొందిన వారికి వాస్తవాలు తెలుసన్నారు. సీఎం ఇచ్చిన మాట మేరకు హంద్రీ–నీవా కుప్పం కాలువ పనులను పూర్తి చేసి నీరు తీసుకువస్తున్నారని చెప్పారు. ఇప్పటికే వి.కోట మండలానికి చేరిన కృష్ణా జలాలు మరో వారం రోజుల్లోపు కుప్పం నియోజకవర్గంలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నరేష్‌కుమార్ రెడ్డి, పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసులు, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి తదితరులు మాట్లాడారు.

భగీరథ యత్నం.. వసతులు లభ్యం

తమిళనాడు సరిహద్దు పట్టణం నగరి. ఇక్కడి నుంచి నిత్యం చెన్నైకు రాకపోకలు సాగించే జనం.. అయినా ఇక్కడి రైల్వేస్టేషన్లలో వసతుల లేమి.. ఈ విషయం గుర్తించిన మంత్రి రోజా స్టేషన్ల అభివృద్ధికి అలుపెరగని పోరాటం.. భగీరథయత్నం చేశారు. ఫలితంగా అక్కడి రైలు నిలయాలకు వసతుల లభించాయి.

- రైల్వేస్టేషన్ల అభివృద్ధికి మంత్రి రోజా అలుపెరగని పోరాటం
- నగరి నియోజకవర్గంలోని స్టేషన్లలో సమకూరిన వసతులు


రైల్వే జీఎం వశిష్ట జోలేకు వినతిపత్రం అందిస్తున్న మంత్రి ఆర్కేరోజా (ఫైల్)

నగరి : నియోజకవర్గంలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి మంత్రి రోజా అలుపెరగని పోరాటం చేశారు. ఇప్పటికీ చేస్తూనే ఉన్నారు. ఫలితంగా రైల్వేస్టేషన్లలో వసతులు సమకూరుతున్నాయి. నగరి మున్సిపాలిటీ పరిధిలోని ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌లో రూ.5 కోట్ల వ్యయంతో అండర్‌బ్రిడ్జి నిర్మించారు. అలాగే సుమారు రూ.1.05 కోట్ల వ్యయంతో ఫుట్ ఓవర్ పాత్, రూ. 75 లక్షల వ్యయంతో ప్లాట్ ఫామ్, ప్రయాణికులు కూర్చునేందుకు సిమెంటు కుర్చీలు ఏర్పాటు చేశారు. అలాగే రూ.25 లక్షల వ్యయంతో ఎల్‌ఈడీ లైట్ల అమరిక, రూ. 20 లక్షల వ్యయంతో పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, రూ. 20 లక్షల వ్యయంతో పే అండ్ యూజ్ టాయిలెట్స్, రూ.15 లక్షల వ్యయంతో సర్క్యులేటింగ్ ఏరియా డెవలప్‌మెంట్, రూ. 15 లక్షల వ్యయంతో వెయిటింగ్ హాల్ తదితర వసతులు సమకూరాయి. నాలుగో ప్లాట్ ఫామ్ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఏకాంబరకుప్పం గేటు ఆనుకుని డంపింగ్ యార్డులా చెత్తకుప్పలున్న ప్రాంతాన్ని శుభ్రపరచి, మళ్లీ అక్కడ చెత్త డంపింగ్ చేయకుండా చర్యలు చేపట్టారు. ఉదయం 10 నుంచి 2 వరకు మాత్రమే ఉన్న రిజర్వేషన్ సమయాన్ని 8 నుంచి 2 గంటల వరకు పెంచి, అడిషనల్ కౌంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. పుత్తూరు రైల్వేస్టేషన్‌లో ప్లాట్ ఫామ్ నిర్మించారు. సీట్ల రిజర్వేషన్ సంఖ్యను పెంచారు. కోవిడ్ కారణంగా ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ లేకుండా చేసిన గరుడాద్రి, కాచిగూడ 17652 ట్రైన్లను మళ్లీ రైల్వే అధికారులతో చర్చించి స్టాపింగ్ ఏర్పాటు చేయించారు. తిరుత్తణి వరకే పరిమితమై ఉన్న చెన్నై తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను మళ్లీ తిరుపతి వరకు నడిచేలా చేసి నియోజకవర్గ ప్రజలకు ప్రయాణ సౌకర్యం కల్పించారు.

ఓర్వలేక అక్కసు ప్రదర్శిస్తున్న ప్రతిపక్ష పార్టీలు

2015 నుంచి గత ఏడాది వరకు క్రమం తప్పకుండా మంత్రి ఆర్కేరోజా రైల్వే సమస్యలపై పోరాడుతూనే ఉన్నారని, కొన్ని పనులను ఆమె తన చారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేతలు తెలిపారు. ఇలా సమస్యను


ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్‌లో నిర్మించిన ఫుట్‌ఓవర్‌పాత్

పరిష్కరించే నేపథ్యంలోనే ఆమె స్వయంగా ఏకాంబరకుప్పం రైల్వే అండర్ బ్రిడ్జిని శుభ్రం చేశారని, అయితే ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడేదో ఎన్నికల నిమిత్తం పనులు చేస్తున్నట్లు ప్రకటించడం వారి ఓర్వలేని తనానికి అద్దం పడుతోందని వారు పేర్కొన్నారు. మంచి పనులు చేసేవారిని ప్రోత్సహించకపోగా, అక్కసును ప్రదర్శించడం, పనులను తప్పుబట్టడం ప్రతిపక్ష పార్టీల నీచరాజకీయాలకు నిదర్శనమన్నారు. ఎన్నికల నిమిత్తం చేసే పనులు కావని ఎనిమిదేళ్లుగా ఆమె పోరాడుతూనే ఉన్నారని, అభివృద్ధి పనులు చేయించుకుంటూ వస్తున్నారని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.

మంత్రి పోరాటం ఇలా..

- 2015, మే 25వ తేదీన నియోజకవర్గంలోని రైల్వే స్టేషన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి చెన్నైకు వెళ్లి, సదరన్ రైల్వే జీఎం సురేష్‌కుమార్ శర్మకు వినతిపత్రం సమర్పించారు.
- 2016, జనవరి 28వ తేదీన ఏకాంబరకుప్పం, పుత్తూరు రైల్వేగేట్ల వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉందని ఉమ్మడి తనిఖీ చేసి, అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని చెన్నై, సదరన్ రైల్వే జీఎం వశిష్ట జోలేకు వినతిపత్రం అందజేశారు.
- 2020 ఫిబ్రవరిలో అప్పటి కేంద్ర రైల్వేమంత్రి పియూష్‌గోయల్‌ను కలసి రైల్వేస్టేషన్‌కు వసతులు కావాలని వినతిపత్రం ఇచ్చారు.
- 2021 డిసెంబర్ 26వ తేదీన గరుడాద్రి రైలులో జనరల్ కోచ్ ఏర్పాటు చేయాలని, స్థానికంగా ఉన్న విద్యార్థులు, వ్యాపారులు ఈ రైలుపైనే ఆధారపడి ఉన్నారని చెన్నై డివిజన్ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు లేఖ పంపారు.
- 2023 ఫిబ్రవరి 14వ తేదీన మంత్రి తరపు ప్రతినిధి డీఆర్‌ఎం గణేష్‌కు ఏకాంబరకుప్పం, పుత్తూరు స్టేషన్లలో ఫ్లైఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని, చెన్నై ముంబై ఎక్స్‌ప్రెస్‌ను, యూనిట్ ట్రైన్లను పుత్తూరు వరకు పొడిగించాలని వినతిపత్రం అందజేశారు.

క్షేత్రసహాయకులకు సంక్రాంతి కానుక


సంక్రాంతి కానుక అందజేస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెలోని తన కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు సంక్రాంతి కానుక అందజేశారు. రూరల్ మండలంలోని సహాయకులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు విలువ చేసే చీర, ప్యాంట్, షర్ట్‌ను బ్యాగులో ఉంచి, పంపిణీ చేశారు. అనంతరం వారికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్‌బాబునాయుడు, సర్పంచ్‌లు అమర్‌నాథ్‌రెడ్డి, త్యాగరాజులు, వైఎస్సార్ సీపీ నాయకులు దేవేంద్రరెడ్డి, వేలుస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు మారుపేరు భారతి సిమెంట్


మేస్త్రీలకు బీమా పత్రం, బహుమతులను అందజేస్తున్న ప్రతినిధులు

పూతలపట్టు: భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ నాణ్యతకు మారు పేరు అని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ ఛాయాపతి, మార్కెటింగ్ ఆఫీసర్ బాలకృష్ణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆనంద ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీమేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్మన్ టెక్నాలజీ, రోబోటెక్ క్వాలిటీ కంట్రోల్ ఇంజినీరింగ్ నిపుణులతో భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన సిమెంట్లతో పోలిస్తే భారతి సిమెంట్ తక్కువ సమయంలో సెట్టింగ్ పూర్తవుతుందని తెలిపారు. సిమెంట్ రంగంలో భారతి సిమెంట్ అగ్రగామిగా నిలిచిందన్నారు. మేస్త్రీలకు భారతి సిమెంటు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు, విశిష్టత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. భారతి సిమెంట్ ప్రతి చోటా లభించేలా డీలర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం 50 మందికి పైగా మేస్త్రీలకు రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా పత్రాలతో పాటు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్, మేస్త్రీలు పాల్గొన్నారు.

మాన్యంలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె: శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయానికి చెందిన మాన్యంలో ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకూడదని, నిబంధలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గ్రూప్ టెంపుల్స్ ఈఓ కమలాకర్ హెచ్చరించారు. బుధవారం సాక్షి దినపత్రికలో మాన్యం భూమి స్వాహా శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏకాంబరం ఈ విషయమై విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు చౌడేపల్లెలో ఆక్రమణలను పరిశీలించి, ఆరా తీశారు. స్థానిక ప్రైవేటు బస్టాండ్‌లో బక్రామ్ అలియాస్ మమతా సేట్ రూ.కోట్ల విలువ చేసే దేవదాయ శాఖ మాన్యం స్థలాన్ని ఆక్రమించుకుని, నిర్మిస్తున్న నాలుగు అంతస్తుల భవనాన్ని వారు పరిశీలించారు. ఆ స్థలంలో భవన నిర్మాణ పనులు ఆపి వేయాలని నోటీసులు జారీ చేసినట్లు కమలాకర్ తెలిపారు. అలాగే దేవస్థానం స్థలంలో నోటీసు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.


అక్రమ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవదాయశాఖ ఈఓ కమలాకర్

వినతిని వెనక్కి తీసుకోవాలి


మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా

పుత్తూరు: ఎన్నికల విధుల నుంచి సచివాలయ ఉద్యోగులను తప్పించాలంటూ టీడీపీ నేత చంద్రబాబు నాయుడు ఎలక్షన్ కమిషన్‌కు ఇచ్చిన వినతి పత్రాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులమైన సచివాలయ సిబ్బందిని బానిసలంటూ చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ పాలనలో ఉద్యోగాలు సంపాదించుకున్న వారందరూ టీడీపీ బానిసలా అని ప్రశ్నించారు. రాజ్యాంగం కల్పించిన వ్యవస్థల ద్వారా నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచి సంపాదించుకున్న ఉద్యోగాలను అవహేళన చేసి మాట్లాడడం ఆయన స్థాయికి తగదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి, యువత నిరుద్యోగ సమస్యను పరిష్కరించిందన్న అక్కసుతో రాజకీయంగా మాట్లాడడం అన్యాయం అన్నారు. తాము ఎవరికీ బానిసలం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను బాధ్యతగా నిర్వహించడం జరుగుతుందని, ఏ రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేయరన్న విషయాన్ని 40 ఏళ్ల అనుభవం ఉన్న నేతకు తాము చెప్పాల్సి రావడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు తన వినతి పత్రాన్ని వెనక్కి తీసుకుని హుందాగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.



ఎర్రచందనం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కారు సహా ఎర్రచందనంతో అటవీశాఖాధికారులు

రొంపిచెర్ల: వాహనంసహా ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీ శాఖ నిఘా విభాగం డీఎఫ్ఓ సుబ్బారెడ్డి తెలిపారు. డీఎఫ్ఓ కథనం మేరకు.. ఎర్ర చందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన రహస సమాచారం మేరకు పులిచెర్ల మండలం కొత్తపేట వద్ద అటవీశాఖాధికారులు నిఘా పెట్టారు. ఆ సమయంలో రొంపిచెర్ల నుంచి ఏపీ 39 హెచ్‌ఈ 1373 నంబర్ మహేంద్ర కారు అతి వేగంగా వస్తుండడంతో దాన్ని ఆపారు. డ్రైవర్ కారు ఆపకపోవడంతో వెంబడించగా కారును గంగాధర నెల్లూరు మండలం వెంకటాపురం వద్ద రోడ్డు పక్కన అపి డ్రైవర్ పరారయ్యాడు. వాహనంలో తనిఖీ చేయగా 8 ఎర్ర చందనం దుంగలు ఉన్నట్లు గుర్తించి, వాహనం సహా వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఎర్ర చందనం విలువ సుమారు రూ. 12 లక్షలు ఉంటుందని అటవీశాఖాధికారులు అంచనా వేశారు. సంచార విభాగం ఎఫ్ఆర్వో వెంకటరమణ, ఎఫ్‌బీఓ ప్రతాప్, ప్రొటెక్షన్ వాచర్లు ప్రభుతేజ, వెంకటేష్, మల్లికార్జున, డ్రైవర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

49 కిలోల వెండి స్వాధీనం

గుడిపాల: తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఎటువంటి రసీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 49 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నట్లు చిత్తూరు వెస్ట్ సర్కిల్ సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో బుధవారం నుంచి చెన్నై–బెంగళూరు జాతీయరహదారిలోని గుడిపాల మండలం తమిళనాడు సరిహద్దులో చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ వాహనాలను తనిఖీ చేస్తుండగా తమిళనాడు నుంచి చిత్తూరు వైపు వస్తున్న టీఎన్ 01 ఎవై 6423 క్రేటా కారులో 49 కిలోల వెండిని ఎటువంటి రసీదులు లేకుండా తీసుకువెళుతుండగా గుర్తించి, స్వాధీనం చేసుకుని తిరుపతి కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పగించామని సీఐ తెలిపారు. దీని విలువ సుమారు 35 లక్షలు విలువ ఉంటుందన్నారు. ఎస్ఐ రామ్మోహన్, సిబ్బంది కార్తీక్, బాబులు పాల్గొన్నారు.

రైల్వేశాఖపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు


మూతపడిన రైల్వేగేటు

పుత్తూరు: లేని సమస్యలను సృష్టించి, దానిని పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్న రైల్వే శాఖపై పుత్తూరు మండలం ఒంటిమిట్ట గ్రామస్తులు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పిటిషన్‌పై స్పందించిన కమిషన్ సదరన్ రైల్వే జనరల్ మేనేజర్‌కు నోటీసులు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే...పుత్తూరు మండలం కేఎం అగ్రహారం నుంచి ఒంటిమిట్ట గ్రామానికి వెళ్లే మార్గంలో రైల్వే గేటు ఉండేది. ఇటీవల రైల్వే అధికారులు రైల్వే గేటును శాశ్వతంగా మూసివేసి, అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేశారు. అయితే ఆ అండర్ బ్రిడ్జిలో వర్షం కురిసిన ప్రతిసారి నీరు నిలిచిపోయి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. గ్రామానికి ఉన్న ఏకైక మార్గంలో ఇలా తరచూ రాకపోకలు స్తంభించిపోవడంతో ఒంటిమిట్ట గ్రామ ప్రజలు నిత్యావసర వస్తువులకు సైతం అలమటించే పరిస్థితి నెలకొనేది. దీనిపై పలుమార్లు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులు గత డిసెంబర్ 19వ తేదీన మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జాతీయ మానవ హక్కుల కమిషన్ ఈనెల 9వ తేదీన చెన్నైలోని సదరన్ రైల్వే జీఎంకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని నోటీసులో సూచించింది.

పలమనేరు ఏఎంసీని సందర్శించిన ఆర్జేడీ


మార్కెట్ కమిటీని సందర్శిస్తున్న ఆర్జేడీ రామాంజినేయులు

పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీని కడప ఆర్జేడీ రామాంజినేయులు బుధవారం సందర్శించారు. స్థానిక ఏఎంసీ పరిధిలోని వి.కోట, శివునికుప్పం, రాయలపేటలో సాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. పట్టణ సమీపంలో ఇంటిగ్రేటెట్ టమాట మార్కెట్‌కు సంబంధించి పనులు వేగవంతం చేయాలని స్థానిక ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డిని కోరారు. ఇప్పటికే వెటర్నటీ యూనివర్సిటీ స్థలం కోసం ప్రభుత్వం రూ.1.5 కోట్లను చెల్లించిందని, త్వరలోనే స్థలాన్ని స్వాధీనం చేసుకుని నిర్మాణ పనులు వేగవంతం చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాట్‌ఎంట పరమేశ్వరన్, మార్కెట్ కార్యదర్శి సంజీవకుమార్, పర్యవేక్షకులు జ్ఞానాంబ, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్య


సోనియా మృతదేహం

పెద్దపంజాణి: వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వీరప్పల్లెలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మండలంలోని వీరప్పల్లెకు చెందిన శ్రీనివాసులు కుమార్తె సోనియా (23) అదే గ్రామానికి చెందిన చందు వేధిస్తున్నాడని గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయినా అతనిలో మార్పురాక పోగా వేధింపులు ఎక్కువ కావడంతో మంగళవారం రాత్రి సోనియా ఇంట్లో ఉరేసుకుంది. ఈ విషయం గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమార్తె మృతికి చందు కారణమని మృతురాలి తండ్రి శ్రీనివాసులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ..

సోనియా మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ పార్టీ నాయకులతో కలసి వీరప్పల్లెకు చేరుకున్నాడు. ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పెద్దపంజాణి వైస్ ఎంపీపీ జీడీ బాబు, పార్టీ మండల కన్వీనర్ బాగారెడ్డి, పార్టీ నాయకులు జయప్ప, గట్టప్ప, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


హేమలత మృతదేహం

పుంగనూరు: పట్టణంలోని హిదయత్‌నగర్‌కు చెందిన హేమలత(37) అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతి చెందింది. సీఐ రాఘవరెడ్డి కథనం మేరకు.. పుంగనూరు పట్టణానికి చెందిన పురుషోత్తం మదనపల్లెలోని రామాచారిపాళేనికి చెందిన హేమలతను సుమారు పదిహేనేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం హేమలత ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది. అయితే ఆమె కుటుంబ సభ్యులు హేమలతది ఆత్మహత్య కాదని, భర్త పురుషోత్తం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని ఆరోపించారు. సమాచారం అందుకున్న సీఐ రాఘవరెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి, శవాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద స్థితి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.